తాగునీటి సమస్య పరిష్కారానికి నిధుల వరద



చెరువులోని మట్టిని తొలగిస్తున్న జేసీబీ యంత్రాలు



ధర్మ చెరువు పనులు పర్యవేక్షిస్తున్న గ్రామ పెద్దలు

నిడమర్రు: బువ్వనపల్లిలో ఏళ్ల తరబడి నెలకొన్న తాగునీటి సమస్యను పూర్తిస్థాయిలో పరిష్కరించేందుకు రూ.1.62 కోట్ల నిధులతో పలు అభివృద్ధి పనులు చేపట్టారు. గ్రామంలో ప్రధాన మంచినీటి వనరు ధర్మ చెరువు పూడిక పనులు 70 ఏళ్ల తర్వాత ప్రారంభించినట్లు మాజీ సర్పంచ్ సంకు శేషగిరిరావు తెలిపారు. గ్రామంలో ప్రధానమైన తాగునీటి సమస్యను తొలగించేందుకు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు చేస్తున్న కృషిపై స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- బువ్వనపల్లిలో రూ. 1.62 కోట్లతో ఆధునికీకరణ పనులు
- ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరందించడమే లక్ష్యం
- చురుగ్గా ధర్మ చెరువు పూడిక తీత పనులు

రూ.1.62 కోట్ల నిధుల మంజూరు

జలజీవన్ మిషన్ నిధులు రూ.1.10 కోట్లతో ఆధునికీకరణ పనుల్లో భాగంగా రక్షిత మంచినీటి పథకం ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మించడంతోపాటు తాగునీరు సరఫరా చేసేందుకు పాత పైప్‌లైన్లు తొలగించి వాటి స్థానంలో కొత్త వాటిని ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే గ్రామ పంచాయతీ నిధులు రూ.30 లక్షల వ్యయంతో ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేలా మైక్రో ఫిల్టర్ యూనిట్ ఏర్పాటు చేసారు. జగనన్న–వాసన్న కాలనీలో తాగునీటి సరఫరా కోసం రూ.9 లక్షలతో నూతన పైప్‌లైన్‌తోపాటు పబ్లిక్ ట్యాప్‌లు ఏర్పాటు చేసారు. మండలానికి తాగునీరు అందించే చినకాపవరం పంట కాలువ నుంచి గ్రామంలోని జగ్గయ్య చెరువు వరకూ లిఫ్ట్ పద్ధతిలో కాలువలోని నీటిని తరలించేందుకు రూ.13 లక్షల నిధులు కేటాయించారు.

70 ఏళ్ల తర్వాత ధర్మ చెరువు పూడిక తీత

గ్రామంలోని ప్రధాన మంచినీటి వనరు అయిన ధర్మ చెరువు పూడిక పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఈ చెరువు 6.5 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. దీనిలో పూడిక తీసేందుకు రూ.30 లక్షల నిధులు కేటాయించారు. వీటిలో రూ.20 లక్షలు జిల్లా పరిషత్ అభివృద్ధి నిధులు, రూ.10 లక్షలు ముఖ్యమంత్రి అభివృద్ధి నిధుల నుంచి సమీకరించారు. ఈ పనుల ప్రగతిపై ఎమ్మెల్యే ఎప్పటికప్పుడు అధికారులు, పంచాయతీ సిబ్బందితో సమీక్షిస్తూ, అవసరమైన ఆదేశాలు జారీ చేస్తున్నారు. గ్రామంలో ప్రస్తుతం జగ్గయ్య చెరువు, ధర్మ చెరువుల నుంచే మొత్తం తాగునీరు సరఫరా అవుతోంది. ఈ రెండు చెరువుల వద్ద ఉన్న రక్షిత మంచినీటి పథకాల నీటి సామర్థ్యం 2.40 లక్షల లీటర్లు ఉంటుందని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుబ్రహ్మణ్యం తెలిపారు.

ఫిబ్రవరి నెలాఖరులోపు పనులు పూర్తి



ధర్మ చెరువులో పేరుకు పోయిన పూడికను 70 ఏళ్ల తర్వాత తొలగింపు పనులు చేపట్టడం ఆనందంగా ఉంది. ఈ పూడిక తీత పనులు ఫిబ్రవరి నెలాఖరులోపు పూర్తయ్యేలా ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు సహకారంతో కృషి చేస్తున్నాం. సుమారు 4అడుగుల లోతు తవ్వకం పనులు చురుగ్గా సాగుతున్నాయి. పనులు పూర్తయితే వచ్చే వేసవిలో గ్రామంలో ఎటువంటి తాగునీటి సమస్య ఉండదు. శివారు ప్రాంతాలకు సైతం తాగునీరు సరఫరా చేస్తాం.

– కిలారి సత్యవతి రవిబాబు, సర్పంచ్, బువ్వనపలి

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి చేరిక



దెందులూరులో వైఎస్సార్‌సీపీలో చేరిన నాయకులతో ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

దెందులూరు: పెదవేగి మండలం కే.కన్నాపురంలో టీడీపీకి ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీనుంచి టీడీపీ నాయకులు ఆదివారం ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి సమక్షంలో బొర్రా సురేంద్ర, బొర్ర రాఘవేంద్రరావు, బొర్రా రాధాకృష్ణ, మరీదు రఘు, మరీదు రమణ, వీరబాబు, కుమారస్వామి వైఎస్సార్ సీపీలో చేరారు. వారి వెంట వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి జానంపేట ప్రసాద్ బాబు, ఏఎంసీ మాజీ చైర్మన్ మేకా లక్ష్మణరావు, పెదవేగి మండల పార్టీ అధ్యక్షుడు మెట్లపల్లి సూరిబాబు, ఫారెస్ట్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పళ్ళెం ప్రసాద్, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గంటా ప్రసాదరావు, పార్టీ జిల్లా కార్యదర్శి కే.మురళి ఉన్నారు.

మృతుల కుటుంబాలను ఆదుకుంటాం



ఏలూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గండికోట శ్రీనును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు

భీమడోలు: కురెళ్లగూడెం గ్రామానికి చెందిన మృతుల కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకుంటామని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. జాతీయ రహదారి పూళ్ల వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కురెళ్లగూడెంకు చెందిన కూలీలు దంగ్రు వీరాస్వామి, కర్నాటి మహేంద్ర, ఊటుకూరి ఫణీంద్ర మృతి చెందిన విషయం విదితమే. తీవ్ర గాయాలతో గండికోట శ్రీను ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న మూడు మృతదేహాలను ఆయన పరిశీలించారు. మృత దేహాలకు వెంటనే పోస్ట్‌మార్టమ్ చేసి కుటుంబ సభ్యులు అప్పగించాలని సంబంధిత ఆసుపత్రి సూపరింటెండెంట్‌తో ఎమ్మెల్యే వాసుబాబు ఫోన్‌లో మాట్లాడి ఆ కార్యక్రమాన్ని వేగంగా పూర్తి చేయించారు. మృతుల కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించి ఓదార్చారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గండికోట శ్రీనును పరామర్శించారు. వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ప్రభుత్వ పరంగా రావాల్సిన వైఎస్సార్ బీమా నగదు త్వరితగతిన అందేలా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆర్టీసీ యాజమాన్యం ఇచ్చిన హామీలు అమలయ్యేలా ప్రయత్నం చేస్తానని వివరించారు. రోడ్డు ప్రమాదాలు కుటుంబాలను చీకట్లోకి నెట్టేస్తున్నారని, ఎంత జాగ్రత్తగా ప్రయాణిస్తున్నా ప్రమాదాలు జరగడం చాలా బాధాకరమన్నారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని తన ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేసారు. అనంతరం మృతదేహాలను కురెళ్లగూడెంకు తరలించగా అక్కడ అంత్యక్రియలు నిర్వహించారు. వారి కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. మృతులు ముగ్గురు నిత్యం కూలి పనులకు వెళ్లే తరుణంలో అప్యాయతానురాగాలతో ఉండే వారని, వారిని రోడ్డు ప్రమాదంలో మరణించడం బాధాకరమని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేసారు. కర్నాటి మహేంద్ర, ఊటుకూరి ఫణీంద్ర, వీరాస్వామి వారి కుటుంబ సభ్యులు గుండెవిసేలా రోధించారు. ఈ కార్యక్రమాల్లో సీఐ వి.వెంకటేశ్వరరావు, తహసీల్దార్ షంషూద్దీన్, సర్పంచ్ గుడివాడ నాగగౌతమి సీతారామాంజనేయులు, పెద్దలు రావిపాటి గాంధీ, గన్ని గోపాలరావు, నీలపాల గంగాధరరావు, కె.గోపాలస్వామి, పి.అయ్యప్ప, వీఆర్వోలు ఇంతియాప్, మార్కేండేయులు పాల్గొన్నారు.

శివాలయాల్లో ప్రత్యేక పూజలు



పార్వతీదేవికి వెండి ఆభరణాలు ఎమ్మెల్యే వాసుబాబు ద్వారా ఆలయానికి అందజేస్తున్న భక్తులు

దెందులూరు: శివరాత్రి ఉత్సవాలు ఆదివారం రెండో రోజు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దెందులూరు, చల్లచింతలపూడి, దోసపాడు, జోగన్నపాలెం, శ్రీరామవరం, పోతునూరులో పురాతన ఆలయాలకు భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధ్వజస్తంభం, జమ్మిచెట్టు వద్ద దీపాలంకరణ చేశారు. వివిధ శాఖల ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు స్వామివారిని దర్శించుకున్నవారిలో ఉన్నారు.

పార్వతీ దేవికి వెండి చీర సమర్పణ

ఉంగుటూరు: స్థానిక భీమేశ్వరస్వామి ఆలయంలోని పార్వతీ దేవికి అలంకరించేందుకు భక్తులు తయారు చేయించిన వెండిచీర, పానిపట్టం, మకర తోరణాన్ని స్థానిక ఎమ్మెల్యే వాసుబాబు ద్వారా ఆలయానికి భక్తులు సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

శివాలయం వద్ద భారీ అన్నసమారాధన

గణపవరం: మహాశివరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం గణపవరంలోని సువర్ణేశ్వర స్వామి ఆలయం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించారు. గ్రామానికి చెందిన దాత సాగిరాజు సుబ్బరాజు సహకారంతో మూడు దశాబ్దాలుగా ఏటా మహాశివరాత్రి సందర్భంగా సుబ్బరాజు ఆర్థిక సహకారంతో అన్నసమారాధన నిర్వహిస్తున్నారు. ఆదివారం ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అన్నప్రసాద వితరణ ప్రారంభించారు. దెందుకూరి ప్రసాదరాజు దంపతులు, ఆర్‌వీఎస్ రాజు, నంద్యాల రామలింగరాజు, ప్రధాన అర్చకులు చెరుకూరి వరప్రసాద్, చెరుకూరి మణిబాబు, దేవస్థానం ఈవో, దేవాదాయ సిబ్బంది పాల్గొన్నారు. సుమారు 5 వేలమంది భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

26న దెందులూరులో పూర్వ విద్యార్థుల సమ్మేళనం



దెందులూరు ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న నిర్వహణ కమిటీ నాయకులు

దెందులూరు: దెందులూరులోని వివేకానంద గురుకుల పాఠశాల (1968 నుంచి1975 వరకు)పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం స్థానిక ధనలక్ష్మి నర్సింగ్ కళాశాలలో నిర్వహించనున్నట్టు నిర్వహణ కమిటీ సభ్యులు గారపాటి విశ్వనాథం, మద్దిపాటి జయనేంద్రకుమార్, మరడాని అచ్యుతరావు అన్నారు. ఈ సమ్మేళనానికి పూర్వ విద్యార్థి, ప్రస్తుత రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, మరో ఇద్దరు ప్రజాప్రతినిధులు, దేశవిదేశాల్లో విద్య, వైద్య, రాజకీయ, వ్యాపార రంగాల్లో స్థిరపడిన అనేక మంది హాజరవుతారని తెలిపారు. భవిష్యత్తులో చేపట్టే కార్యక్రమాలను పూర్వ విద్యాల సమ్మేళనంలో ప్రకటిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు బొర్రా పట్టాభి, ప్రభాకరరావు ఉన్నారు.

ఏప్రిల్ 5న రైతుల సమస్యలపై చలో ఢిల్లీ



పూళ్లలో మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్

భీమడోలు: రైతుల సమస్యల పరిష్కారం కోసం ఏప్రిల్ 5న జరగనున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ అన్నారు. పూళ్లలోని సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం మండల రైతు సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతాంగ వ్యతిరేక విధానాలకు నిరసనగా నిర్వహించనున్న చలో ఢిల్లీ కార్యక్రమంలో లక్షలాది మంది రైతులతో కార్మిక, కర్షక ఐక్యతా ర్యాలీని నిర్వహిస్తున్నామన్నారు. రైతు ఉద్యమంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మోదీ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. ఈ సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి కట్టా భాస్కరరావు, రైతు సంఘం నాయకులు వెజ్జు శ్రీరామచంద్రమూర్తి, జి.కృష్ణబాలాజీ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : రాష్ట్రంలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బీపీ సాల్మన్ రాజు కోరారు. ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ ఏలూరు జిల్లా శాఖ కార్యవర్గ సమావేశం ఆదివారం స్థానిక సంఘ జిల్లా కార్యాలయంలో ఏలూరు జిల్లా అధ్యక్షుడు బి.రెడ్డిదొర అధ్యక్షతన నిర్వహించారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : నగరానికి చెందిన శ్రీ రామకోటి విశ్వశాంతి సమాజం ఆధ్వర్యంలో జరుగుతున్న 91వ శ్రీరామకోటి మహోత్సవాల్లో భాగంగా ఆదివారం విద్యార్థులకు భారతం, రామాయణం అంశాలపై క్విజ్ పోటీలు నిర్వహించారు. ప్రత్యేక పూజలు అనంతరం ఉదయం 7 గంటల నుంచి విశ్వశాంతి సమాజం సభ్యులు మౌనధ్యానం, భక్తిగీతాలపనలు, హరేరామ సంకీర్తనలు చేశారు. అనంతరం స్వామి వారికి సహస్రనామ పూజలు, నిత్య హోమం చేసి స్వామి వారి నిత్య కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం నిర్వహించిన క్విజ్ పోటీల్లో నగరంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీల్లో ఎల్‌బీసీ స్కూల్ విద్యార్థులు విజేతలుగా నిలువగా, శ్రీకృష్ణదేవరాయ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులు ద్వితీయ స్థానం సాధించారు. వీరితో పాటు ఎల్‌బీసీ మెయిన్ క్యాంపస్ విద్యార్థులు తృతీయ స్థానంలో, అశోక్ నగర్ భాష్యం స్కూల్ విద్యార్థులు ప్రోత్సాహక బహుమతులు గెలుచుకున్నారు. ఈ పోటీలకు అనగాని శ్రీరామచంద్రమూర్తి క్విజ్ మాస్టర్‌గా వ్యవహరించారు. సాయంత్రం 7 గంటల నుంచి నగరానికి చెందిన అభినయ నృత్యభారతి సంస్థ ఆధ్వర్యంలో నాట్యాచార్య దువ్వి హేమ సుందర్ శిష్య బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు భక్తులను విశేషంగా అలరించాయి. తొలుత అర్చక స్వాములు దివాకరుని వెంకటేశ్వర్లు, తుమ్మలపల్లి కాశీ విశ్వేశ్వర శర్మ విశేష పూజలు నిర్వహించగా శ్రీరామకోటి విశ్వశాంతి సమాజం అధ్యక్షుడు గాదంశెట్టి రమేష్ కార్యక్రమాలు పర్యవేక్షించారు.

28 నుంచి ఎమ్మార్పీఎస్ పాదయాత్ర



దెందులూరులో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తనగాల శేఖర్

దెందులూరు: మండలంలో ఈ నెల 28 నుంచి మార్చి 2 వరకు ఎమ్మార్పీఎస్ పాదయాత్ర నిర్వహించనున్నట్టు రాష్ట్ర ఉపాధ్యక్షుడు తనగాల శేఖర్ అన్నారు. ఆదివారం దెందులూరు ప్రెస్ క్లబ్‌లో దెందులూరు నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ కన్వీనర్ కే.మురళీకృష్ణతో కలిసి ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ సాధన లక్ష్యంగా జాతీయ అధ్యక్షుడు నాగరాజు చేస్తున్న పాదయాత్ర 28వ తేదీ దెందులూరు మండలం ఖండ్రిక నర్సింహపురంలో ప్రారంభమవుతుందన్నారు. ఈ పాదయాత్రలో మండలంలోని ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్, ఎంఈఎఫ్ విభాగాల సభ్యులందరూ పాల్గొనాలని నియోజకవర్గ కన్వీనర్ మురళి కోరారు. జాతీయ అధ్యక్షుడు నాగరాజుతో పాటు రాష్ట్ర నాయకులు బయ్యారపు రాజేశ్వరరావు, జిల్లా నాయకులు పలివెల చంటి, కనకరావు, చల్లపల్లి ప్రసాద్, వివిధ విభాగాల నాయకులు పాల్గొంటారన్నారు.

ఘనంగా వేంకటేశ్వర స్వామి శాంతి కల్యాణం



వేంకటేశ్వర స్వామికి తలంబ్రాలు పోస్తున్న వగ్వాల మీనాకుమారి అచ్యుతరామారావు దంపతులు

భీమడోలు: గుండుగొలనులో వేంచేసియున్న శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి వారి శాంతి కల్యాణోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. దేవాదాయ ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రీతికరమైన శ్రవణ నక్షత్రాన్ని పురస్కరించుకుని క్షీరాభిషేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ పూర్వపు చైర్మన్ వగ్వాల మీనాకుమారి అచ్యుతరామారావు, ఆలయ ఈవో డి.శంకరరావు పర్యవేక్షణలో గ్రామం సుభిక్షంగా ఉండాలని కోరుతూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారి మంగపతి ఆచార్యులు శాస్త్రోక్తంగా కల్యాణతంతును నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు తలంబ్రాలు పోసారు. వగ్వాల మీనాకుమారి అచ్యుతరామారావు స్వామి వారికి నూతన వస్త్రాలను బహూకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.

రేపు రహదారి నిర్మాణానికి సర్వే

ఉంగుటూరు: ఏలూరు కాలువపై కొత్తగా నిర్మిస్తున్న బ్రిడ్జికి అనుగుణంగా ఆర్అండ్‌బీ రహదారి నిర్మించనున్నారు. ఈనెల 21న రహదారి నిర్మాణానికి సర్వే ప్రారంభించేందుకు భీమడోలు ఆర్అండ్‌బీ ఇంజనీర్లు సన్నాహాలు చేస్తున్నారు. నాలుగు లైన్ల రహదారి నిర్మాణానికి ప్రభుత్వ భూమి ఎంత ఉంది. ఇంకా ఎంత మేరకు ప్రైవేటు భూమి తీసుకోవాలనే విషయంపై సర్వే చేస్తున్నట్లు ఆదివారం ఆర్అండ్‌బీ ఏఈ భాస్కరరావు తెలిపారు.

ఛత్రపతి శివాజీకి ఘన నివాళి



శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మండే సుధాకర్

భీమడోలు: భీమడోలు, పూళ్ల, శాఖా గ్రంథాలయాల్లో చదవడం మాకిష్టం కార్యక్రమం ఆదివారం ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. భీమడోలు శాఖా గ్రంథాలయంలో వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన బాలబాలికలు సామూహిక పుస్తక పఠనంలో పాల్గొని ఎంపిక చేసుకున్న పుస్తకాలను చదివారు. భీమడోలు శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాలను డాక్టర్ సత్యం ఫౌండేషన్ అధినేత బాలనాగు విజయసారధి, శ్రీధర విజయకృష్ణ ప్రోత్సాహాన్ని అందిస్తున్నారు. తొలుత ఛత్రపతి శివాజీ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.

అలరించిన హాస్యవల్లరి

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : నగరానికి చెందిన హాసం క్లబ్ ప్రతి నెలా మూడో ఆదివారం నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన హాస్య వల్లరి కార్యక్రమాలు ఆద్యంతం అలరించాయి. పలువురు సభ్యులు హాస్య చతురతతో కూడిన వ్యాఖ్యానాలు, మరికొందరు జోకులు చెప్పి సభికులను నవ్వుల్లో ముంచెత్తారు. క్లబ్ సీనియర్ సభ్యులు మోతే శ్రీనివాస నారాయణ రావు, త్రిపుర సుందరి దంపతులను ఘనంగా సత్కరించారు.

క్లుప్తంగా

కొండలరావుకు ఉత్తమ రైతు అవార్డు



ఉత్తమ రైతు అవార్డు గ్రహీత కాళి కొండలరావు

దెందులూరు: దెందులూరు మండలంలో రామారావుగూడెం గ్రామానికి చెందిన పట్టుపరిశ్రమ సాగు చేసే రైతు కాళి కొండలరావుకు ఉత్తమ రైతు అవార్డుకు ఎంపికయ్యారని ఆ శాఖ దెందులూరు మండల టెక్నికల్ అసిస్టెంట్ టీ.రత్తయ్య తెలిపారు. సేంద్రియ, వ్యవసాయ పద్ధతుల ద్వారా తక్కువ ఖర్చుతో పట్టు పరిశ్రమ నిర్వహిస్తూ అధిక దిగుబడి సాధిస్తూ ఇతర రైతులకు ఆదర్శంగా నిలిచిన కొండలరావును జిల్లా అధికారులు ఉత్తమ రైతుకుగా ఎంపిక చేశారన్నారు. కొండలరావు ప్రస్తుతం ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ ద్వారా రెండు ఎకరాల్లో పట్టు పరిశ్రమ నిర్వహిస్తున్నారు.

వినతుల స్వీకరణ



కార్యాలయంలో దివ్యాంగుడితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

దెందులూరు: దివ్యాంగుల సమస్యల పరిష్కారంలో అధికారులు తొలి ప్రాధాన్యతనివ్వాలని స్పందన, ఎమ్మెల్యే కార్యాలయం సిఫార్సులు త్వరితగతిన పరిష్కరించాలని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అధికారులకు సూచించారు. ఆదివారం ఎమ్మెల్యే కార్యాలయంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన విభిన్న ప్రతిభావంతులు, ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కార్యాలయ సిబ్బందితో సమస్యను నమోదు చేయించిన పరిష్కారానికి సంబంధిత శాఖలకు పంపాలని చెప్పారు. దెందులూరు శివాలయం ఉత్సవాలకు హాజరుకావాల్సిందిగా కమిటీ చైర్మన్ శ్రీనివాసరావు, ఎంపీటీసీ తాళ్లూరి నాగరాజు, ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరికి ఆహ్వానపత్రాన్ని అందజేశారు.

వీరబ్రహ్మేంద్రస్వామికి ఎమ్మెల్యే పూజలు



పెదకడిమిలో వీరబ్రహ్మేంద్రస్వామికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

పెదవేగి : వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం పెదవేగి మండలం పెదకడిమిలో వీరబ్రహ్మేంద్రస్వామి కల్యా ణ మహోత్సవం నిర్వహించారు.ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి స్థానిక నాయకులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్థానికంగా ఉన్న సమస్యలను అడిగి తెలుసుకుని, పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కొప్పాక సొసైటీ చైర్‌పర్సన్ చళ్ళగొళ్ల భూస్వామి, స్థానిక నాయకులు పర్వతనేని కృష్ణారావు, పర్వతనేని నాగయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంత యువతకు ఉద్యోగ అవకాశాలు

దెందులూరు: గ్రామీణ ప్రాంత యువతీ యువకులకు ఉద్యోగాలు కల్పించాలనే ఉద్దేశ్యంతో ఏర్పాటు చేసిన దీనదయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌసల్యయోజన, సీడాప్ ఆధ్వర్యంలో ఫ్లో స్కిల్స్ సంస్థ ద్వారా ఉచిత శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆ సంస్థ ద్వారా హెచ్ఎంఎస్ కంపెనీలో 12 మంది ఉద్యోగాలు పొందారు. వారికి ఆదివారం రాత్రి తన కార్యాలయంలో ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి నియామక పత్రాలు అందచేసి శుభాకాంక్షలు తెలిపారు.

కనుల పండువగా పార్వతీ పరమేశ్వరుల కల్యాణోత్సవం



పార్వతీ పరమేశ్వర స్వామి దేవస్థానంలో పల్లకి సేవ ప్రారంభిస్తున్న భక్తులు

పెదవేగి : స్థానిక పార్వతీ పరమేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం రాత్రి నిర్వహించిన పార్వతీపరమేశ్వరుల కల్యాణ మహోత్సవంలో ఎంపీపీ తాతా రమ్యకుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పెదవేగి మాజీ సర్పంచ్ తాతా సత్యనారాయణ ఆర్థిక సాయంతో ఎంపీపీ తాతా రమ్యకుమార్ ఆధ్వర్యంలో మహిళలకు పసుపు, కుంకుమలు ప్రదానం చేశారు. వివిధ గ్రామాల నుంచి అధిక సంఖ్యలో వచ్చిన ప్రజలకు పెదవేగి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేశారు.